సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



బ్యాడ్మింటన్‌లో..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 8లో▸



వాహనాల తనిఖీ

నందిగామ శివారులోని పాత జాతీయ రహదారిపై ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. 8లో▸



ఈవీఎంల గోడౌన్ పరిశీలన

రాజేంద్రనగర్‌లోని ఈవీఎంల గోడౌన్‌ను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సందర్శించారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపటి నుంచి యథావిధిగా ప్రజావాణి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి కార్యక్రమం సోమవారం నుంచి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో స్థానిక ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి రద్దు చేయడం జరిగిందని తెలిపారు. హైకోర్టు స్టే విధించిందున రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు వాయిదా వేయడం జరిగిందని, ప్రజావాణి కార్యక్రమాన్ని ఎప్పటిలాగే కొనసాగించడం జరుగుతుందని చెప్పారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

మున్సిపల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



చల్లా నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పహాడీషరీఫ్: రాష్ట్రంలో మున్సిపల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్‌ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర అవుట్ సోర్సింగ్ కారోబార్, బిల్ కలెక్టర్ల కమిటీ కోరింది. ఈ మేరకు కమిటీ నాయకులు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2016లో ఇచ్చిన జీవోఎంఎస్–14 ప్రకారం మున్సిపాలిటీలో కలిసిన గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. తమకు కేటాయించిన పనులను సమర్థవంతంగా చేస్తున్నప్పటికీ, నెలకు కేవలం రూ.15,600 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న అందరినీ రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.22,750 చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

డీజీపీని కలిసిన బార్ అసోసియేషన్ కమిటీ



డీజీపీతో కమిటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం: డీజీపీ శివధర్‌రెడ్డిని ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా 12 కోర్టు భవన సముదాయాల నిర్మాణం గురించి వివరించారు. తనవంతు సహకారం అందిస్తానని శివధర్‌రెడ్డి తెలిపినట్లు వారు చెప్పారు. అదేవిధంగా న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డిని సైతం కలిసి స్థానిక సమస్యలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముద్ద వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి అరిగే శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎలమోని భాస్కర్, లైబ్రరీ సెక్రటరీ నిట్టు పాండు పాల్గొన్నారు.

నేడు 2కే రన్

ఇబ్రహీంపట్నం: ప్రజాహితం పర్యావరణ పరిరక్షణ సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు ఇబ్రహీంపట్నం బీడీఎల్ రోడ్డు నుంచి 2 కే రన్ ప్రారంభం అవుతుందని సంస్థ చైర్మన్ సురేష్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్

అనంతగిరి: ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్ (కవాతు) వికారాబాద్ పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా భారీ కవాతు నిర్వహించారు. పట్టణంలోని కొత్తగంజ్ నుంచి ప్రారంభమై ప్రధాన వీధుల మీదుగా సాగింది. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సద్భావన సహ ప్రముఖ్ రామకృష్ణ మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ పాటు పడుతుందన్నారు. ఈ దేశానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు. యావత్ ప్రపంచానికే దిశానిర్దేశం చేసిన ఘనత భరత భూమికే దక్కుతుందన్నారు. హిందూ సమాజం ఐక్యతతో ముందుకు సాగాలని.. రాబోయే రోజుల్లో ప్రపంచానికే దేశంఆదర్శంగా నిలవబోతుందన్నారు.

డీసీసీకి కసరత్తు!



కొత్తసారథి కోసం అధిష్టానం అన్వేషణ

- నేడు జిల్లాకు ఏఐసీసీ పరిశీలకుల బృందం
- లీడర్ కోసం కేడర్ నుంచి అభిప్రాయ సేకరణ
- పీఠం కోసం నేతల మధ్య పోటాపోటీ.. సిఫార్సులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించింది. రానున్న ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలవడమే లక్ష్యంగా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లాకు కొత్త సారథిని ఎంపిక చేసే పనిలో నిమగ్నమైంది. కేడర్ నుంచి అభిప్రాయ సేకరణ కోసం ఏఐసీసీ పరిశీలకుల బృందం ఆదివారం జిల్లాకు చేరుకోనుంది. హిబిహెడెన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ పరిశీలకుల బృందంలో పీసీసీ నుంచి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కోటింరెడ్డి వినయ్‌రెడ్డి, బబెదుల్లా కొత్వాల్, విజయారెడ్డిని ఎంపిక చేసింది. ఈ పరిశీలకుల బృందం జిల్లాలోని అన్ని బ్లాకుల్లోనూ వారం రోజుల పాటు పర్యటించనుంది. ఒక్కో బ్లాక్‌లో రెండు చొప్పున సమావేశాలు నిర్వహించనుంది. ఎమ్మెల్యేలతో పాటు కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశమై వారి అభిప్రాయాలు సేకరించనుంది. జిల్లా నుంచి ముగ్గురు పేర్లను సేకరించి, పీసీసీ ద్వారా ఏఐసీసీకి పంపనుంది. ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న సీనియర్లకు, నిత్యం ప్రజలతో మమేకమై, పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి డీసీసీ పీఠాన్ని కట్టబెట్టే అవకాశం ఉంది.

ఆశావహుల మధ్య పోటీ

ఏడేళ్లుగా చల్లా నర్సింహారెడ్డి డీసీసీ పీఠంపై కొనసాగుతూ వస్తున్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ (మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్) పోస్టును కట్టబెట్టింది. ప్రస్తుతం ఆయన స్థానంలో కొత్తగా మరొకరిని అధ్యక్షుడిని నియమించాలని నిర్ణయించింది. కార్యకర్తల అభీష్టం మేరకు కొత్త అధ్యక్షుడిని ఎన్నిక చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఆశావహుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. డీసీసీ పీఠాన్ని ఆశిస్తున్న వారిలో చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన కంటెస్టెడ్ ఎమ్మెల్యే భీం భరత్ సహా ఇదే నియోజకవర్గానికి చెందిన పీసీసీ సభ్యుడు గౌరీసతీష్, మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ బొక్క చెన్నారెడ్డితో పాటు మరికొంత మంది సీనియర్లు ఉన్నారు. వీరంతా తమ పేర్లను ముఖ్య నేతలతో అధిష్టానానికి సిఫార్సు చేయిస్తుండటం విశేషం.

నెలాఖరులోగా ఎంపిక

పరిశీలకుల బృందం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి కార్యకర్త వరకు అభిప్రాయాలు సేకరించనుంది. ఈ ప్రక్రియను ఈ నెల 19లోగా పూర్తి చేయనుంది. నెలాఖరులోగా డీసీసీకి కొత్త సారథిని ఎంపిక చేయనుంది. ఇప్పటి వరకు జిల్లా పార్టీలో రెడ్డి సామాజిక వర్గం ఆధిపత్యమే కొనసాగుతూ వస్తోంది. నామినేటెడ్ పదవుల్లోనూ వారే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఓసీ సామాజిక వర్గం నుంచి ఇద్దరు పోటీ పడుతుండగా, ఎస్సీ సామాజిక వర్గం నుంచి, బీసీ సామాజిక వర్గం నుంచి ఒక్కొక్కరు చొప్పున పోటీ పడుతున్నారు. పరిశీలకుల బృందం ఈ ఆశావహుల్లో కేవలం ముగ్గురి పేర్లను మాత్రమే పరిగణలోకి తీసుకొని అధిష్టానానికి పంపనుంది. పార్టీ అధినేత రాహుల్ గాంధీ సంస్థాగత పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పాటించి తీరాలని ఆదేశిస్తున్నారు. సామాజిక సమీకరణాల్లో భాగంగా ఒకవేళ ఈ సూత్రం అమలైతే బీసీ సామాజిక వర్గానికి డీసీసీ పీఠం దక్కే అవకాశం ఉంది. లేదంటే ఓసీ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరిలో ఎవరో ఒకరికి ఈ పీఠం దక్కే ఛాన్స్ ఉంది.

రైతులకు వరం 'పీఎం ధన్‌ధాన్య'

జిల్లా వ్యవసాయాధికారి ఉష

ఇబ్రహీంపట్నం రూరల్: పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో దోహదపడుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఉష తెలిపారు. ప్రధానమంత్రి ధన్‌–ధాన్య కృషి యోజన పథకం, పప్పు ధాన్యాల మిషన్‌ను ప్రధాని నరేంద్రమోదీ శనివారం వర్చువల్ ద్వారా ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ప్రారంభ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి, వివిధ మండలాల నుంచి దాదాపుగా 200 మంది రైతులు, కేవీకే సెంటర్, క్రిడా తరఫున శాస్త్రవేత్తలు, డివిజన్ ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ.. ఈ పథకం ఆరేళ్ల పాటు కొనసాగుతుందని తెలిపారు. వ్యవసాయ రంగం తక్కువ ఉత్పాదకత, తగినంత హామీ లేని నీటి పారుదల, పరిమిత రుణ లభ్యత, పంట కోత తర్వాత మౌలిక సదుపాయలు లేకపోవడం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. వ్యవసాయ సామర్థ్యం సమృద్ధిగా ఉన్నప్పటికీ ఉత్పాదకత, ఆర్థికాభివృద్ధి పరంగా వెనుకబడిన అనేక జిల్లాల్లో ఈ సవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ఈ అంతరాలను పరిష్కరించాల్సిన అవసరాన్ని గుర్తించి కేంద్రం 2025 బడ్జెట్‌లో పీఎం ధన్‌ధాన్య కృషి యోజన కింద 100 ఆకాంక్షాత్మక వ్యవసాయ జిల్లాలను అభివృద్ధి చేస్తామని ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త విజయ్‌కుమార్, చిత్తాపూర్ గ్రామ రైతు అన్నపూర్ణ ప్రకృతి వ్యవసాయంలో తన అనుభాలను తోటి రైతులతో పంచుకున్నారు.



కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉష తదితరులు

తైక్వాండోలో జాతీయ స్థాయికి ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన అండర్–14 బాలికల బృందం

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–14 ఎస్‌జీఎఫ్ తైక్వాండో టోర్నీ శనివారం ముగిసింది. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో బాలబాలికలకు వివిధ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు బంగారు, రజత, కాంస్య పతకాలు అందించారు. పోటీల్లో మనస్విని (నిజామాబాద్), జునేరియా కుల్‌సమ్ (నల్లగొండ), సమన్విత (రంగారెడ్డి), కతిజాఫాతిమా (నిజామాబాద్), మగేశ్ మెహరిన్ (రంగారెడ్డి), హారిక (రంగారెడ్డి), సమీక్ష (రంగారెడ్డి), టి.వైష్ణవి(హైదరాబాద్) బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 28 నుంచి నాగాలాండ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు నాగమణి పేర్కొన్నారు. పోటీలను ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఈశ్వర్, పరిశీలకుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రయాణానికి నిరీక్షణ

పండుగలు, పెళ్లిళ్లు, సెలవులు

- రైళ్లకు భారీ డిమాండ్
- వందల్లో వెయిటింగ్ లిస్ట్
- శబరి ఎక్స్‌ప్రెస్‌లో నో రూమ్
- పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు
- ఫ్లైట్ చార్జీలు సైతం పైపైకి..
- సిటీ నుంచి పెరగనున్న రద్దీ



సాక్షి, సిటీబ్యూరో: వందల్లో రైళ్లు. వేలల్లో బెర్తులు. అయినా తప్పని నిరీక్షణ. పండుగలు, పెళ్లిళ్లు, వరుస సెలవులు, శుభకార్యాలు, అయ్యప్ప భక్తుల శబరి పర్యటనల రద్దీతో రైళ్లకు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అన్ని రెగ్యులర్ రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ వందల్లోకి చేరింది. కొన్ని రైళ్లలో 'నో రూమ్' దర్శనమిస్తోంది. సాధారణ రోజుల్లో కంటే ప్రత్యేక సందర్భాల్లో హైదరాబాద్ నుంచి ప్రయాణికుల రద్దీ సహజంగానే రెట్టింపవుతోంది. ఇందుకనుగుణంగా వివిధ మార్గాల్లో దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తోంది.

అదనంగా సుమారు 150 రైళ్లు

దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి వంటి పండుగలు, వరుస సెలవుల దృష్ట్యా అన్ని రెగ్యులర్ రైళ్లలో భారీ డిమాండ్ నెలకొంది. సికింద్రాబాద్, చర్లపల్లి, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల నుంచి విశాఖ, కాకినాడ, తిరుపతి, కర్నూలు, కోల్‌కతా, చెన్నై, శబరి, దానాపూర్, పట్నా, ఢిల్లీ తదితర నగరాలకు రాకపోకలు సాగించే అన్ని రెగ్యులర్ రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల జాబితా గణనీయంగా పెరిగింది. మరోవైపు ఎప్పటికప్పుడు ఈ డిమాండ్ అధికమవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యేక రైళ్ల నిర్వహణకు ప్రణాళికలను రూపొందించారు. వివిధ మార్గాల్లో సుమారు 150 రైళ్లను అదనంగా నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

సంక్రాంతి ప్రయాణం కష్టమే..

- సంక్రాంతికి 25 లక్షల నుంచి 30 లక్షల మంది సొంతూళ్లకు వెళ్తారని అంచనా. రైళ్లు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతో పాటు సొంత వాహనాల్లోనూ ఎక్కువ మంది బయలుదేరుతారు. కాగా.. ఇప్పటికే కొన్ని రూట్లలో డిమాండ్ మేరకు అధికారులు ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. అయినా రోజురోజుకూ ప్రయాణికుల డిమాండ్ పెరుగుతూనే ఉంది. సికింద్రాబాద్, చర్లపల్లి స్టేషన్‌ల నుంచి బయలుదేరే విశాఖ, ఫలక్‌నుమా, కోణార్క్, నాందేడ్ సూపర్‌ఫాస్ట్, ఈస్ట్‌కోస్ట్, గరీబ్‌రథ్, దురంతో తదితర రైళ్లలో 100 నుంచి 150 వరకు వెయిటింగ్ లిస్ట్ నమోదు కావడం గమనార్హం.
- కాకినాడ వైపు వెళ్లే గౌతమి, నర్సాపూర్ తదితర రైళ్లలోనూ వెయిటింగ్ లిస్ట్ 100 వరకు నమోదైంది. సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వరకు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు దీపావళి రద్దీ పోటెత్తింది. ఈ మార్గంలో సికింద్రాబాద్ నుంచి ముజఫర్‌నగర్‌కు కొత్తగా అమృత్‌భారత్‌ను ప్రవేశపెట్టినప్పటికీ దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల డిమాండ్ ఏ మాత్రం తగ్గలేదు. దీపావళి వేడుకల కోసం నగరం నుంచి యూపీ, బిహార్ తదితర రాష్ట్రాల్లోని సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు రైళ్ల కోసం ఇప్పటి నుంచే పడిగాపులు కాస్తున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకూ దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు రద్దీ భారీగానే ఉండనుందని అధికారులు భావిస్తున్నారు.

విమాన చార్జీల మోత

మరోవైపు దీపావళి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ఎయిర్‌లైన్స్ చార్జీలను రెట్టింపు చేశాయి. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, నాగ్‌పూర్ తదితర నగరాలకు చార్జీలు అనూహ్యంగా పెరిగినట్లు సమాచారం. సాధారణంగా హైదరాబాద్ నుంచి ఢిల్లీకి రూ.6,000 వరకు చార్జీలు ఉంటే ఈ నెల 18, 19, 20 తేదీల్లో రూ.9,000 నుంచి రూ.12,000 వరకు పెంచారు. జైపూర్ రూ.7,000 నుంచి ఏకంగా రూ.15,000 వరకు చార్జీలు పెరిగాయి. కోల్‌కతాకు రూ.5,000 నుంచి రూ.7,000 వరకు ఉంటుంది. దీపావళి దృష్ట్యా ప్రస్తుతం రూ.12,000 వరకు పెరిగినట్లు ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులు చెప్పారు.

బీసీ రిజర్వేషన్లకు కేంద్రం అడ్డంకులు

అనంతగిరి: తెలంగాణ బీసీలపై కేంద్రం కపట నాటకం తేటతెల్లమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ విమర్శించారు. శనివారం వికారాబాద్‌లోని అమరవీరుల స్తూపం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మైపాల్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను గవర్నర్ ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. బీజేపీ నాయకత్వం బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని లేదంటే బీసీలను క్షమాపణ కోరాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయ పద్ధతిలో రిజర్వేషన్ల అమలుకు చొరవ తీసుకోవాలని కోరారు.

వాట్సాప్ వ్యవసాయం

- రైతుల కోసం ప్రత్యేక చానల్ ప్రారంభించిన వ్యవసాయ శాఖ
- కర్షకుల సమస్యలకు పరిష్కారం చూపుతున్న శాస్త్రవేత్తలు, అధికారులు
- క్షణాల్లో సమాచారం చేరవేత

దుద్యాల్: రైతులకు వ్యవసాయ సమాచారం సులువుగా అందించేందుకు వ్యవసాయ శాఖ నూతనంగా వాట్సాప్ చానల్ రూపొందించింది. సాగు చేసిన పంటలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు ఈ చానల్‌లో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచనలు అందిస్తున్నారు. ఈ చానల్ పంటలకు సంబంధించి కావాల్సిన సమాచారాన్ని క్షణాల్లో కర్షకులకు చేరవేస్తూ అండగా నిలుస్తోంది. ప్రభుత్వ పథకాలు, వాతావరణ సూచనలు, నాటు పద్ధతులు, ప్రభుత్వ రాయితీలు, తదితర వ్యవసాయ సమాచారాన్ని అందిస్తున్నారు.

తెలుగులో సమాచారం

వ్యవసాయశాఖ ప్రారంభించిన వాట్సాప్ చానల్‌లో అధికారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక ప్రతిభావంతులను చేర్చారు. తాజాగా గ్రూప్‌లో రైతులను చేర్చాలని ఆదేశాలు రావడంతో ఆసక్తి ఉన్న రైతులను వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల ఫోన్ నంబర్లు నమోదు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతీ రైతు వాట్సాప్ చానల్‌లో చేరే అవకాశం కల్పించింది. విత్తన దశ నుంచి పంట చేతికి వచ్చే వరకు పంటల సమాచారం రైతులకు సులువుగా చేరుతోంది. తెలుగులోనూ సమాచారం అందుబాటులో ఉండడంతో రైతులు వినియోగించుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఫొటోల సాయంతో తెగుళ్ల లక్షణాలు, నివారణకు పురుగు మందులు ఎలా వినియోగించాలనే సమాచారం ఇస్తున్నారు. వాట్సాప్ చానల్‌లో చేరాలనుకుంటే సంబంధిత ఏఈఓ, మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

ఒక్క క్లిక్‌తో..

వ్యవసాయశాఖ రూపొందిన వాట్సాప్ చానల్ ద్వారా రైతులు ఒక క్లిక్‌తో నేరుగా శాస్త్రవేత్తలు, నిపుణుల సలహాలు పొందొచ్చు. పంటల రోగ నిరోధకత, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, విత్తనాల ఎంపిక వంటి సలహాలు అరచేతిలోకి చేరుతున్నాయి. తమ సమస్యలను ఫొటో లేదా మెసేజ్ రూపంలో షేర్ చేస్తే నిపుణులు వెంటనే సమాధానం అందిస్తారు. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ మంది రైతులకు ఒకేసారి సమాచారం తెలుసుకునేందుకు డిజిటల్ వ్యవసాయ విజ్ఞానం చాలా ఉపయోగకరంగా ఉందని రైతులు చెబుతున్నారు.



వ్యవసాయశాఖ రూపొందిన వాట్సాప్ చానల్

తక్షణ పరిష్కారం



రైతులకు సాంకేతిక పరిజ్ఞానం నేరుగా అందించడం వ్యవసాయ శాఖ ఉద్దేశం. ఇప్పటికే రైతులు సమాచారలోపంతో సాగు చేస్తున్న పంటల్లో దిగుబడులు తగ్గి నష్టపోతున్నారు. అందరి రైతుల వద్దకు వ్యవసాయ శాస్త్రవేత్తలు వెళ్లడం కష్టం. ఈ చానల్ ద్వారా శాస్త్రవేత్తలు, నిపుణుల సలహాలు పొందొచ్చు. సమస్యలపై తక్షణ పరిష్కారం అందించడంతో ఉత్పత్తి పెరుగుతుంది. సమయం, ఖర్చు తగ్గుతుంది. రైతులు చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి.

– రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్



మట్టి ప్రమిదలు దొంతులు రెడీ

వెలుగుల పండుగ దీపావళి అరుదెంచింది. చిన్నాపెద్దా కలిసి బాణసంచా కాలుస్తారు. ఇంటింటా దొంతులు ఏర్పాటు చేస్తారు. ప్రమిదలు వెలిగిస్తారు. దీంతో మట్టి దొంతులు, ప్రమిదల తయారీలో కుమ్మరి వృత్తి పనివారు బిజీగా మారారు. కాప్రా సమీపంలోని నాగారంలో ప్రమిదలను తయారు చేస్తున్నారు. సికింద్రాబాద్‌లో దొంతులకు వినియోగించే గురుగులకు రంగులు అద్ది అందంగా తీర్చిదిద్దుతుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.



ఆస్పత్రికి వెళ్లిన మహిళ అదృశ్యం


అరుంధతి (ఫైల్)

చేవెళ్ల: ఆస్పత్రికి వెళ్తొస్తానని చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యం అయింది. ఈ సంఘటన దేవునిఎర్రవల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరుంధతి(46) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి చేవెళ్లలోని హాస్పిటల్‌కు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాలేదు. ఆమె పోన్ స్విచ్ఛాఫ్ అయింది. రాత్రి వరకు చుట్టుపక్కల, చేవెళ్లలో, తెలిసిన వారిని, బంధువుల వద్ద ఆరా తీసినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అరుందతి తమ్ముడు దయాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ శివారులోని పాత జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నిషేధిత మత్తు పదార్థాలు తరలిస్తున్నారనే సమాచారం మేరకు సోదాలు చేపట్టామని తెలిపారు. నిషేధిత వస్తువులను విక్రయించినా, తరలించినా చట్టవిరుద్ధమని, అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు దేవరాజ్, యాదయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన


గోడౌన్‌ను సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఈవీఎంల గోడౌన్‌ను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎంల గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తును పరిశీలించారు. రాజేంద్రనగర్ తహసీల్దార్, వేర్ హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

మణికొండ: నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... జీవనోపాధి కోసం మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కోకాపేటకు చెందిన విజయలక్ష్మి(25) తన భర్త ఆంజనేయులుతో కలిసి సబితానగర్‌కు వచ్చి నివసిస్తుంది. ఈ నెల 7వ తేదీన భర్త ఉదయం పనికి వెళ్లే సమయంలో ఇంట్లోనే ఉంది. సాయంత్రం తిరిగి వచ్చి చూసే సరికి ఆమె కనిపించలేదు. అదే విషయాన్ని ఆంజనేయులు తన అత్త అనసూయకు తెలిపాడు. పలు ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేక పోవటంతో అనసూయ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. విజయలక్ష్మి సమాచారం ఎవరికైనా తెలిస్తే నార్సింగి పోలీస్ స్టేషన్ ఫోన్: 94910 39034లో సమాచారం ఇవ్వాలని కోరారు.

స్థల వివాదంలో దాడి

ఒకరికి తీవ్ర గాయాలు

మొయినాబాద్ రూరల్: స్థలం విషయంలో జరిగిన దాడిలో ఒకరు తీవ్రంగా గాయపడి, ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ సంఘటన ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సురంగల్ గ్రామ సమీపంలోని పోల్ట్రీ ఫామ్ దగ్గర 250 గజాల ప్లాట్ ఉంది. దీనిపై రామగళ్ల ఎల్లయ్య కుమారులు నందం, శ్యామ్, శ్రీకాంత్ ముగ్గురికి సమాన హక్కు ఉంది. ఇదే విషయమై శనివారం శ్యామ్ అన్న కుమారుడు ప్రసాద్.. ప్లాట్ వద్ద గొడవకు దిగాడు. బాబాయి అయిన శ్యామ్(35)పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. విషయం బాధితుడి భార్య అనితకు తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అక్కడికి చేరుకున్న వారు.. కత్తిపోట్లతో రక్తపు మడుగులో పడున్న శ్యాంను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

షాద్‌నగర్‌రూరల్: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలుకింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధి చటాన్‌పల్లి సమీపంలో శనివారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పటేల్‌రోడ్డుకు చెందిన ఆంజనేయులు(35) కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. అతను చిననాడే.. తల్లితండ్రులను కోల్పోయాడు. పెళ్లి అయిన కొంత కాలానికే భార్య వదిలి వెళ్లింది. వీటితో మానసికంగా కృంగిపోయిన సదరు వ్యక్తిని అనారోగ్యం వెంటాడింది. నా అనే వారు లేక.. మనస్తాపానికి గురై.. కాచిగూడ నుంచి రాయచూరు వెళ్తున్న డెమో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలను బంధువులకు సమాచారం అందించారు. స్టేషన్ మాస్టర్ అభిదేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయికి..


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీలు, తదితరులు


ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ అక్బర్, జోనల్ సెక్రెటరీ, ఫిజికల్ డైరెక్టర్లు

- ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సత్తాచాటిన తాండూరు విద్యార్థులు
- స్టేట్ లెవల్ పోటీలకు ఎనిమిది మంది ఎంపిక

తాండూరు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తాండూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్- 14, 17 విభాగాల్లో ఎనిమిది మంది బాలబాలికలు జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం పరిగిలో నిర్వహించిన అండర్- 14 విభాగం డబుల్స్‌లో సాయి ప్రతీక్, అర్జున్‌గౌడ్ ప్రథమ స్థానం, సింగిల్స్‌లో సాయి ప్రతీక్ ప్రథమ స్థానం, అర్జున్ గౌడ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల అండర్- 14 విభాగం డబుల్స్‌లో సందర్శిని, దీక్ష ద్వితీయ స్థానం, బాలికల అండర్- 17 విభాగం డబుల్స్‌లో నందిని, మేరీజోన్స్ ద్వితీయ స్థానం, బాలుర విభాగంలో మణికంఠ, చరణ్ ద్వితీయ స్థానం సాధించారు. ఈ ఎనిమిది మంది వికారాబాద్ జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కాగా సెయింట్ మార్క్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రాక్టీస్ చేసి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్యరెడ్డి, పీడీలు రాము, చరణ్ అభినందించారు.

జిల్లా పోటీలకు 108 మంది ఎంపిక..

శంకర్‌పల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జోనల్ స్థాయి అండర్- 14, 17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్ ఎంపికలు నిర్వహించినట్లు ఎంఈఓ అక్బర్, జోనల్ సెక్రెటరీ ప్రభాకర్ తెలిపారు. మండలం పరిధిలోని మియాఖాన్‌గడ్డలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో జోన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో కబడ్డీ అండర్- 14 బాలబాలికల విభాగంలో 15 మంది చొప్పున 30 మందిని, అండర్- 17 విభాగంలో 15 మంది చొప్పున 30 మందిని, వాలీబాల్ అండర్- 14 బాలబాలికల విభాగంలో 12 మంది చొప్పున 24 మందిని, అండర్- 17లో 24 మందిని ఎంపిక చేశామన్నారు. వీరు ఈనెల 14న హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు బస్వరాజ్, శంకర్, అరుంధతి, పల్లవి, నాగ సంధ్య, అనురాధ, మల్లేశ్, రవీందర్, శ్రీనివాస్, ఆనంద్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడి

శంకర్‌పల్లి: రెండు బెల్టు దుకాణాలపై మోకిల పోలీసులు దాడులు చేశారు. ఈ సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి కొండకల్ గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న నర్సింహ్మారెడ్డి.. అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు. 23 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మోకిలలో రాజు దాబాలో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడి చేయగా.. 5 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వీరిద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు


బహుమతుల ప్రదానోత్సవంలో ఎంఈవో శంకర్ రాథోడ్ తదితరులు

రాజేంద్రనగర్: శివరాంపల్లి పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఈ పోటీల్లో గెలుపొందిన విజేత జట్లులకు ఎంఈవో శంకర్ రాథోడ్, జీహెచ్ఎం భూక్య శ్రీను నాయక్, ఆదర్శ విద్యాలయ చైర్మన్ శ్రవణ్ కుమార్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి, జోనల్ స్థాయి సెక్రటరీ గాంగ్య నాయక్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 210 టీమ్‌లు వివిధ క్రీడాలలో పాల్గొన్నారు. క్రీడలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జోనల్ స్థాయికి ఎంపిక చేశారు. జోనల్ స్థాయి పోటీలు ఆదివారం నుండి శివరాంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో జరుగుతాయని జోనల్ సెక్రటరీ గాంగ్య నాయక్ తెలిపారు. మండలంలోని వివిధ సంఘాల నాయకులు, పీఆర్‌టీయూ అధ్యక్షుడు కడుమూరి సుదర్శన్, ఎస్‌టీయూ అధ్యక్షుడు కామిశెట్టి వెంకటయ్య, యూటీఎఫ్ అధ్యక్షుడు యాదగిరి, ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనార్ధన చారి, పీడీలు జ్యోతి, రంగారెడ్డి, బాలస్వామి రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటానంటూ వెళ్లిన వ్యక్తి అదృశ్యం


శ్రీనివాస్

శంషాబాద్ రూరల్: అప్పులు తీర్చే మార్గంలేక.. కొడుకు చదువుకోవడానికి హాస్టల్‌కు వెళ్లనంటూ మారాం చేయడంతో మనోవేదనకు గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానంటూ ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్ రెడ్డి సమాచారం మేరకు... పిల్లోనిగూడకు చెందిన పానుగంటి శ్రీనివాస్(40) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న ఇతని కొడుకు కిశోర్ దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. ఈ నెల 10న శ్రీనివాస్ తిరిగి హాస్టల్‌కు కొడుకును తీసుకుని వెళ్లగా.. అక్కడ ఉండనంటూ కిశోర్ ఏడ్వడంతో ఇంటికి తీసుకొచ్చాడు. సోదరుల వద్ద తీసుకున్న అప్పు కట్టడానికి డబ్బులు లేవంటూ.. కొడుకు హాస్టల్‌లో ఉండటం లేదనే బాధతో శ్రీనివాస్ అదే రోజు రాత్రి బాధ పడ్డాడు. తాను చనిపోతానని ఇంట్లో తాడు తీసుకుని పొలానికి బయలుదేరాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని వారించినా వినకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో శంషాబాద్ భక్తుల ఇబ్బందులు

- ఓ కుటుంబం లగేజీ మాయం
- స్పందించిన రాజేంద్రనగర్ ఆర్‌డీఓ
- శంషాబాద్‌కు పయనమైన కుటుంబం



శంషాబాద్: తిరుమలలో శంషాబాద్‌కు చెందిన ఓ కుటుంబం లగేజీ మాయం కావడంతో నాలుగు రోజులు అక్కడ ఇబ్బంది పడింది. చివరకు అధికారుల సహకారంతో నగరానికి బయలుదేరారు. వివరాలు.. తిరుమలలో ఐదుగురు సభ్యులుగా కుటుంబం స్వామివారి దర్శనం చేసుకుంది. ఆ తరువాత వారి లగేజీ మొత్తం దొంగలు కొట్టేశారో.. లేక పొగొట్టుకున్నారో తెలియదు కానీ అయోమయంతో కొండ కిందికి చేరుకుని రైల్వేస్టేషన్‌కు వచ్చారు. నాలుగురోజులుగా వారిని గమనిస్తున్న రైల్వేపోలీసులు ఏం జరిగిందని ప్రశ్నించినా సరైన సమాధానం రావడం లేదు. వృద్ధురాలికి, ఆమె కుమారుడికి మాటలు రావడం లేదు. ఓ మహిళ మాట్లాడినా అర్థం కావడం లేదు. పిల్లలు ఎంత అడిగా సరిగా మాట్లాడడం లేదు. అధికారులు కాగితం పెన్ను ఇవ్వడంతో శంషాబాద్ హి హీరోహోండా షాపు, పైన లగేజీలు పోయాయని రాసింది. దీంతో మూడు రోజులుగా రైల్వేపోలీసులే వారి భోజనం సమకూరుస్తున్నారు. ఆ కుటుంబాన్ని పంపేందుకు రైల్వేపోసులు సాక్షిని సంప్రదించి శంషాబాద్ డీసీపీ, రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.. ఆర్‌డీఓ స్పందించి వారి రాకకోసం ఏర్పాట్లు చేయడంతో శనివారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరే బస్సులో వారిని రైల్వే పోలీసులు పంపారు.

డబ్బు కోసం వేధింపులు

మాజీ కార్పొరేటర్ అరెస్టు

- ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షలు డిమాండ్
- శ్రీనాథ్‌రెడ్డికి టీపీఓ వత్తాసు
- ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితుడు
- మాజీ డిప్యూటీ మేయర్ వద్ద రూ. 4 లక్షలు చెల్లింపు
- అయినా ఆగని వేధింపులతో పోలీసులకు బాధితుడి ఫిర్యాదు


మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి

మణికొండ: తాను కొనుగోలు చేసిన స్థలంలో ఇంటిని నిర్మించుకుంటున్న ఓ వ్యక్తిని మాజీ కార్పొరేటర్ ఏకంగా రూ. 10 లక్షలు డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని బతిమాలినా వినిపించుకోకుండా డబ్బులు ఇవ్వకపోతే లోపల వేసి కొడతానని బెదిరించాడు. మాజీ కార్పొరేటర్ అడిగింది ఇచ్చి సమస్య తీర్చుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారి(టీపీఓ) పలు మార్లు నిర్మాణ సామగ్రిని తీసుకెళ్లి మరో వైపు వేధించాడు. వాటిని తాళలేక స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను బాధితుడు ఆశ్రయించాడు. ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ మేయర్‌కు సిఫారసు చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మాజీ డిప్యూటీ మేయర్ ఇంట్లో పంచాయతీ పెట్టి చివరకు రూ. 4 లక్షలు చెల్లించాడు. అయినా వేధింపులు ఆగక పోవటంతో బాధితుడు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డితో పాటు అతని అనుచరుడు సందీప్‌రెడ్డిలను అరెస్టు చేశారు. బాధితుడు నానాజీ శనివారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం ... ఓ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ హైదర్‌షాకోట్‌లో 100 గజాల పాత ఇంటిని ఇటీవల కొనుగోలు చేశాన్నారు. పాత ఇంటిని తొలగించి కొత్త ఇంటి నిర్మాణం చేపడుతుండటంతో మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడన్నారు. తను కొనుగోలు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపడితే డబ్బు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించానన్నాడు. దాంతో మాజీ కార్పొరేటర్ టీపీఓ రాకేష్‌కు చెప్పి పనులను పలుమార్లు నిలుపుదల చేయటం, నిర్మాణ సామగ్రి తీసుకెళ్లి వేధించారన్నారు.

ఎమ్మెల్యేకు ఫిర్యాదు..

తన స్థలంలో తను ఇంటి నిర్మాణం చేస్తుంటే మాజీ కార్పొరేటర్ వేధిస్తున్నాడని బాధితుడు నానాజీ ఇటీవల ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. దాంతో ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డికి ఫోన్ చేసి అతన్ని వేధించవద్దని మాజీ కార్పొరేటర్‌కు చెప్పాలని సూచించాడు. అయినా మాజీ కార్పొరేటర్ పట్టు వీడకుండా టీపీఓతో కలిసి వేధించటంతో మాజీ డిప్యూటీ మేయర్ ఇంట్లో ఇటీవల సమావేశం అయి మాజీ కార్పొరేటర్‌కు చివరకు రూ. 3 లక్షలు నగదుగా, రూ. లక్ష ఆన్‌లైన్‌లో చెల్లించాడు. సమస్య తీరిందని అనుకున్నా తనను వదలకుండా మరో మారు డబ్బులు ఇవ్వాలని వేధించటంతో శుక్రవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశానన్నాడు. ఫిర్యాదులో మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి, అతని అనుచరుడు సందీప్‌రెడ్డి, టీపీఓ రాకేష్‌లు వేధించినట్లు పేర్కొన్నానని బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం మాజీ కార్పొరేటర్, అతని అనుచరున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. టీపీఓ పాత్రపైన విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ కేసు విషయమై నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోరేందుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.